సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే
ఏయూ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. 8లో



మార్గశిర ఉత్సవాలకు ఏర్పాట్లు
కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 13 నుంచి జనవరి 11 వరకు మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నారు. 8లో



వైభవంగా పవిత్రోత్సవాలు
రుషికొండలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 8లో

సాయుధ దళాల పతాక నిధికి కలెక్టర్ తొలి విరాళం



విరాళం అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: సాయుధ దళాల పతాక నిధికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తొలి విరాళం అందజేశారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పతాక నిధికి విరివిగా విరాళాలు అందించాలని పౌరులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం పాల్గొన్నారు.

11న జీవీఎంసీ కౌన్సిల్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ సర్వసభ్య సమావేశం(కౌన్సిల్) ఈ నెల 11న నిర్వహించనున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. ఈ నెల 6న నిర్వహించాల్సిన కౌన్సిల్ మిచాంగ్ తుపాను కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో వాయిదాపడ్డ 18 అంశాలతో పాటు మరో 27 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.

2023–24 ఏడాదిలో 3 నెలల 19 రోజుల(డిసెంబర్ 13 నుంచి మార్చి 31, 2024 వరకు) కాల పరిమితికి జోన్–4 టౌన్‌కొత్తరోడ్డు వద్ద గల సీసీఎస్ ప్రాజెక్ట్ నిర్వహణ, ప్రాజెక్టు నిర్వహించేందుకు అద్దె ప్రాతిపదికన టిప్పర్లు, బ్యాక్ హోయ లోడర్ కోసం పరిపాలన ఆమోదం తెలపనున్నారు. క్లాప్ ఆటోలు, ఈ–ఆటోల ద్వారా తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలు సేకరించేందుకు 655 మంది లోడర్లను రోజువారీ వేతన పద్ధతిలో రూ.450 చొప్పున 66 రోజుల కాలపరిమితికి టెండర్ ద్వారా ఎంపిక, కాంట్రాక్ట్ ఏజెన్సీ నుంచి కార్మికుల సరఫరా, 90, 91, 92 వార్డుల్లో గిరి ప్రదక్షిణ రోడ్డు విస్తరణ పనులు, సెంటర్ డివైడర్లు, ఆర్‌సీసీ డ్రెన్లు, ఆర్‌సీసీ క్రాస్ కల్వర్టుల నిర్మాణం, సమగ్ర మొబిలిటీ ప్లాన్ తయారీ, సీఎం ఈ–బస్ సేవా పథకం జీవీఎంసీ హ్యాండ్ హోల్డింగ్ చేయడంపై చేపట్టే ప్రతిపాదనకు పరిపాలన అనుమతిపై చర్చించనున్నారు. మధురవాడ, పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక క్లస్టర్లు, గృహ అవసరాలకు 66 ఎంఎల్‌డీ నీటి సరఫరా, పంపిణీ, ముడసర్లోవలో నీటి శుద్ధి కర్మాగారం నిర్మాణంతో పాటు కేబీఆర్ నుంచి ట్రాన్స్‌మిషన్ మెయిన్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు షరతులతో కూడిన విస్కో ప్రాజెక్ట్ ప్రతిపాదన తదితర అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి.



14 నుంచి ఆర్గానిక్ మేళా

మద్దిలపాలెం: ఆర్గానిక్ మేళా ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు భారత్ కిసాన్ సంఘ్ జాతీయ నాయకుడు జలగం కుమార్ స్వామి తెలిపారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ మధ్య జరగాల్సిన ఆర్గానిక్ మేళాను తుపాను కారణంగా మార్పు చేసినట్లు పేర్కొన్నారు. శివాజీపాలెంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. 14న ఉత్తరాంధ్ర రైతులతో సమావేశం, 15న గ్రాడ్యుయేట్ రై తుల సమావేశం, 16న ఆర్గానిక్ వ్యాపారం చేసే వారితో సమావేశం, 17న మిద్దె పంట రైతుల సమావేశం ఉంటుందని తెలిపారు. రైతు సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్య వర్మ, శాస్త్రవేత్త అశోక్‌కుమార్, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జె.వి. రత్నం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



డాబాగార్డెన్స్: మూడు రోజులుగా నగరంలో కురిసిన భారీ వర్షాలకు దోమలు వృద్ధి చెంది, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. నగరంలో దోమల నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాలకు పలు చోట్ల వర్షపు నిల్వలు ఉంటాయని, వాటిని గుర్తించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలు, నీటి తొట్టిలు, సన్‌షెడ్లపై నీటి నిల్వలు లేకుండా నగర ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ మూడు రోజులకోసారి నీటి తొట్టిలు ఖాళీ చేసి ఆరబెట్టాలని, నీటి తొట్టెలపై సరైన మూతలు అమర్చాలని సూచించారు. కాచి వడబోసిన నీటిని తాగాలన్నారు. కాలువలను శుభ్రపరచాలని, బ్లీచింగ్, ఫాగింగ్ తదితర దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ శుక్రవారం విధిగా డ్రైడే పాటించాలని విజ్ఞప్తి చేశారు.

టీటీడీ కార్తీక దీపోత్సవం రద్దు

ఎంవీపీకాలనీ: ఆర్కేబీచ్ వేదికగా ఈ నెల 11న నిర్వహించ తలపెట్టిన టీటీడీ కార్తీక దీపోత్సవం రద్దయినట్లు సాగర తీర కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. తుపానుతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలించని నేపథ్యంలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

నేవీ డే ఫైనల్ రిహార్సల్స్ నేడే

బీచ్‌రోడ్డు: నేవీ డే వేడుకలకు సాగరతీరం సిద్ధమవుతోంది. శుక్రవారం నేవీ డే ఫైనల్ రిహార్సల్స్ ప్రదర్శించనున్నారు. ఇందుకు సంబంధించిన గురువారం ప్రాక్టీస్ చేశారు. ఈ నెల 2న ఫైనల్ రిహార్సల్స్, 4న నేవీ డే వేడుకలు నిర్వహించాల్సి ఉండగా.. మిచాంగ్ తుపాను కారణంగా వాయిదా వేశారు. ఈ నెల 8న ఫైనల్ రిహార్సల్స్, 10న నేవీ డే వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా తూర్పు నావికాదళం ఆర్.కె.బీచ్‌లో శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. గతంలోనే ఏర్పాట్లు పూర్తి చేయగా.. తుపాను కారణంగా అవన్నీ తొలగించారు. మళ్లీ మొదటి నుంచి యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన వేదికతో పాటు గ్యాలరీలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఫైనల్ రిహార్సల్స్‌లో మెరైన్ కమాండోలు ఉగ్రవాదులపై దాడులు, స్కై డైవింగ్, హెలికాప్టర్లు, యుద్ధ నౌకలు, విమానాలతో బాంబు దాడులు, రెస్క్యూ ఆపరేషన్ తదితర విన్యాసాలు ప్రదర్శించనున్నారు. అనంతరం నేవీ బ్యాండ్ ప్రదర్శన ఉంటుంది. విన్యాసాలు తిలకించేందుకు వచ్చే ప్రజలు తినుబండారాలను తీసుకురావద్దని తూర్పు నావికాదళం అధికారులు సూచించారు.



సిద్ధం చేస్తున్న ప్రధాన వేదిక

తుది వేడుకలకు గవర్నర్ హాజరు

ఆదివారం జరిగే తుది వేడుకలకు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అనంతరం తూర్పు నావికాదళాధిపతి రాజేష్ పెంధార్కర్ నేవీ హౌస్‌లో ఏర్పాటు చేసే ఎట్ హోమ్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, నౌకాదళ సిబ్బంది హాజరవుతారు.

బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

8, 9, 10 తేదీల్లో డ్రోన్లు ఎగురవేయడం నిషేధం

అల్లిపురం: నేవీ డే పురస్కరించుకుని నగరంలో ఈ నెల 8, 10 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు శాంతి భద్రతల డీసీపీ–1 కె.శ్రీనివాసరావు తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఆయన ఈ వివరాలను విలేకరులకు వెల్లడించారు. నేవీ డే వేడుకలకు 700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో బీచ్‌రోడ్‌లో డ్రోన్లు, గాలిపటాలు, లైట్ ల్యాంపులు వంటివి ఎగురవేయడం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. శుక్రవారం, ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు సాధారణ, విన్యాసాలు వీక్షించేందుకు వచ్చే వాహన చోదకులు, పాస్‌లు కలిగిన వారు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ఇవీ సూచనలు

- కలెక్టరేట్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ, సిరిపురం జంక్షన్ నుంచి ఆలిండియా రేడియో జంక్షన్ మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు, ఆలిండియా రేడియో జంక్షన్ నుంచి పాండురంగాపురం డౌన్ వరకు, నేవల్ క్యాంటీన్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు, పందిమెట్ట జంక్షన్ నుంచి నోవాటల్ హోటల్ వరకు, సెంచరీ క్లబ్ నుంచి నోవాటెల్ హోటల్ వరకు పాస్‌లు లేని వాహనాలను అనుమతించరు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలి.
- ఎంవీపీ నుంచి బీచ్‌రోడ్డు గుండా, సిరిపురం నుంచి బీచ్ వైపు వచ్చే సాధారణ వాహన చోదకులు పార్క్ హోటల్ పక్కన గల ఎంజీఎం గ్రౌండ్‌లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. పార్క్ హోటల్ మీదుగా బీచ్‌రోడ్డులోకి రాకుండా బీచ్‌లోని ఎన్‌క్లోజర్లలోకి కాలినడకన చేరుకోవాలి. పార్క్ హోటల్ నుంచి ఎటువంటి వాహనాలను బీచ్‌రోడ్డులోకి అనుమతించరు.
- వెహికల్ పాస్ కలిగిన వాహనచోదకులు వారికి కేటాయించిన ఏపీఐఐసీ గ్రౌండ్‌లోని గానీ, ఏయూ ఇంగ్లిష్ మీడియం మైదానంలో గానీ, ఫుట్‌బాల్ మైదానంలో గానీ పార్కింగ్ చేసుకోవాలి. అక్కడ నుంచి కాలినడకన బీచ్‌రోడ్డులో తమకు కేటాయించిన ఎన్‌క్లోజర్‌లోకి ప్రవేశించాలి.
- జగదాంబ జంక్షన్, సెవెన్‌హిల్స్ ఆస్పత్రి, కేజీహెచ్ వైపు నుంచి వచ్చే వాహనచోదకులు జిల్లా పరిషత్ ప్రాంగణంలో గానీ, ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానంలో గానీ పార్కింగ్ చేసుకోవాలి. కోస్టల్ బ్యాటరీ జంక్షన్ మీదుగా బీచ్‌రోడ్డులోకి రాకుండా బీచ్‌లోని ఎన్‌క్లోజర్‌లోకి ప్రవేశించాలి.
- నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ వరకు నివసిస్తున్న వారు పోలీసులకు సహకరించాలని డీసీపీ కోరారు. వేరే ప్రత్యామ్నాయ మార్గం లేకపోతే.. తమ ఆధార్ కార్డు చూపిస్తే.. సందర్భాన్ని బట్టి అనుమతిస్తామన్నారు.

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి కృషి

అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి హరేంద్రప్రసాద్

మహారాణిపేట: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించాలని అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎం.ఎస్.హరేంద్ర ప్రసాద్ జిల్లా జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, పెండింగ్ దరఖాస్తులపై గురువారం జేసీలతో ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ విశ్వనాథన్ మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ 27 నుంచి ఇప్పటి వరకు 776 ఫారం–8లు స్వీకరించామని, వాటిలో 705 పరిశీలించామన్నారు. మిగిలిన 71 ఫారాల్లో ఇద్దరు ఎన్‌ఆర్‌ఐలు ఉన్నారని తెలిపారు. ఫారం–7 దరఖాస్తులు 28 వచ్చాయని, వాటిలో 21 పరిశీలనలో ఉన్నాయన్నారు. పెండింగ్ దరఖాస్తులను వారంలోగా పరిష్కరిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో మోహన్ కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, ఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్

పవన్ సభ వెలవెల



జనం లేక వెలవెలబోతున్న సభా ప్రాంగణం

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభ జనం లేక వెలవెలబోయింది. తెలంగాణలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో జనసేన ఘోర వైఫల్యాన్ని మూటగట్టుకుంది. ఈ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా ఆ పార్టీ సాధించలేకపోయింది. దీంతో ఆ పార్టీ కార్యకర్తల్లో, అభిమానుల్లో నైరాశ్యం నెలకొంది. ఆ ప్రభావం ఇప్పుడు ఇక్కడ కనిపించింది. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించాల్సిన సభకు జనం రాకపోవడంతో పవన్ కల్యాణ్ తాను బస చేసిన హోటల్‌లోనే సాయంత్రం వరకు ఉండిపోయారు. అప్పటికే అరకొరగా ఉన్న జనసేన కార్యకర్తలు సభ నుంచి వెళ్లిపోతుండడంతో పరిస్థితిని నాయకులు పవన్‌కు చేరవేశారు. నిర్ణీత సమయానికి మూడు గంటలు ఆలస్యంగా పవన్ సభకు చేరుకున్నారు. అప్పటికే కుర్చీలు ఖాళీగా ఉండడంతో పార్టీ నాయకులు కంగుతిన్నారు. ఖాళీ కుర్చీలను చూసిన నాయకులు బయట ఉన్న జనం లోపలకు రావాలని అభ్యర్థించడం కనిపించింది. సభలో కొద్దిపాటి జనం ఉండగా పవన్ కల్యాణ్ ప్రసంగించారు. 2024 ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమికి మద్దతిచ్చి గెలిపిస్తే ఉత్తరాంధ్రకు మేలు చేస్తానన్నారు. 2019 ఎన్నికల్లో గాజువాక నుంచి ఓడిపోయినా ఇక్కడి ప్రజలు తనని గుండెల్లో పెట్టుకున్నారన్నారు. నటనలో మెలుకువలు నేర్పించిన ఈ ప్రాంతం తనకు మాట్లాడే ధైర్యాన్ని, పోరాడే నైజాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొలుత విశాఖకు చెందిన సుందరపు వెంకట సతీష్‌కుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నాగబాబు, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, కోన తాతారావు, సుందరపు విజయకుమార్, భీశెట్టి వసంత, పసుపులేటి ఉషాకిరణ్, పంచకర్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి పటిష్ట చర్యలు

కలెక్టర్ మల్లికార్జున



పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

బీచ్‌రోడ్డు: వీఎంఆర్డీఏ పార్కు అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన వీఎంఆర్డీఏ పార్కును సందర్శించారు. చిన్న పిల్లల ప్లే పార్కులో పలు ఆట పరికరాలు మరమ్మతులకు గురవడాన్ని గుర్తించి వాటి స్థానంలో కొత్తవి తక్షణమే అమర్చాలన్నారు. పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ దీపాలతో పార్కును సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. వర్షం నీరు సులభంగా బయటకు పోయేలా డ్రైయిన్లు నిర్మించాలన్నారు.బీచ్ వైపు పార్కుకు అనుకొని ఉన్న గోడను పటిష్టం చేయాలని, అవసరమైతే ఎత్తు పెంచాలన్నారు. బాస్కెట్ బాల్, షటిల్ కోర్టుల మెరుగైన నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ కార్యదర్శి కీర్తి తదితరుల పాల్గొన్నారు.

కెమిస్ట్రీ కుదిరింది.. వేడుక అదిరింది

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



శాస్త్రీయ నృత్య ప్రదర్శన



వెస్ట్రన్ పాటకు నృత్యం చేస్తున్న యువతులు



ఫొటో పాయింట్ వద్ద చిద్విలాసం



స్నేహితులను ఉత్సాహపరుస్తూ

ఏయూక్యాంపస్: కొత్తగా కళాశాలలో అడుగిడిన విద్యార్థులకు అపూర్వ స్వాగతం పలికారు సీనియర్ విద్యార్థులు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ మందిరం ఇందుకు వేదికైంది. ఏయూ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. యువతులు చీరకట్టులో తళుక్కుమన్నారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. శాస్త్రీయ, వెస్ట్రన్, జానపద నృత్యాలతో హోరెత్తించారు. కొంత మంది పాటలు ఆలపించి అలరించారు. వేదిక బయట ఏర్పాటు చేసిన ఫొటో స్పాట్ వద్ద ఫొటోలు తీసుకుని పదిలపరచుకున్నారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆచార్య పి.శ్యామల, ఆచార్య వి.సిద్ధయ్య, ఆచార్య కె.బసవయ్య తదితరులు మాట్లాడారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ పొందే దిశగా కృషి చేయాలని, లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కష్టపడాలని సూచించారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు నిర్వహించనున్న ఈ పవిత్రోత్సవాల్లో మొదటి రోజు అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు.

సీపీఆర్‌తో మరణాలు తగ్గించవచ్చు



మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

దొండపర్తి: రోడ్డు ప్రమాదాలు కారణంగా జిల్లాలో ఏటా 350 మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారని, సీపీఆర్ ద్వారా ఈ మరణాల సంఖ్యను తగ్గించవచ్చని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సూచించారు. సీపీ ఆధ్వర్యంలో యంగ్ ఇండియన్స్ ఎన్‌జీవో సహకారంతో కేజీహెచ్ వైద్యులు సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్‌పై గురువారం పోలీస్ కల్యాణ మండపంలో ట్రాఫిక్ పోలీసులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కేవలం ట్రాఫిక్ సిబ్బందికే కాకుండా నగర పోలీసులందరికీ సీపీఆర్, ఫస్ట్‌ఎయిడ్‌పై పూర్తి శిక్షణ ఇస్తామని చెప్పారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు,అనస్థీషియాలజీ అండ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ హెచ్‌వోడీ అల్లు పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్ త్రిప్తి ఎరమిల్లిలు సీపీఆర్, ఫస్ట్‌ఎయిడ్ ఆవశ్యకతను తెలిపారు. ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, చైర్-యంగ్ ఇండియన్స్ ఎన్‌జీఓ రాయ్ కొడాలి, కో-చైర్ హర్షనందన్, విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్ రేవతి పైలా, డాక్టర్లు శ్రావణి, కిరణ్, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారిమళ్లింపు

తాటిచెట్లపాలెం: ఆయా సెక్షన్ల పరిధిలో జరుగుతున్న భద్రతా, ఆధునీకీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ నెల 8వ తేదీన న్యూ జల్పాయ్‌గురి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22612) ఎక్స్‌ప్రెస్, న్యూటిన్‌సుకియా – కేఎస్‌ఆర్ బెంగళూరు (22502) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 9వ తేదీన అగర్తలా-ఎస్ఎంవీ బెంగళూరు (12504) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయినట్లు పేర్కొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తం

మహారాణిపేట: వర్షాలు తగ్గిన నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. ఈ మేరకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను గురువారం అప్రమత్తం చేశారు. పంచాయతీ, మున్సిపల్ అధికారులతో వైద్యాధికారులు సమన్వయం చేసుకుని.. శానిటేషన్ డ్రైవ్ జరిగేలా చూడాలన్నారు. వర్షాల కారణంగా కలుషితమైన నీరు తాగితే పలు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, కాచి చల్లార్చిన నీరు తాగాలని ప్రజలకు సూచించారు. పారిశుద్ధ్యలోపం కారణంగా దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒక వేళ వ్యాధులు సోకితే నిర్లక్ష్యం చేయకుండా.. వెంటనే ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి ఉచిత వైద్య సేవలు పొందాలన్నారు. మలేరియా సిబ్బంది గ్రామాలు, పట్టణాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విద్యార్థిని విచక్షణారహితంగా కొట్టిన ఫ్యాకల్టీ

ఆనందపురం: గిడిజాలలోని నారాయణ అకాడమీలో చదువుతున్న ఓ విద్యార్థిని కళాశాల ఫ్యాకల్టీ విచక్షణారహితంగా కొట్టారు. ఈ ఘటనను నిరసిస్తూ విద్యార్థి బంధువులు కళాశాల వద్ద గురువారం ఆందోళనకు దిగారు. వివరాలివీ.. విజయనగరం జిల్లా బొబ్బిలకు చెందిన బూర్లె యస్వంత్ అకాడమీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా యస్వంత్ అక్కడే చదువుతున్న మరో విద్యార్థినితో సన్నిహితంగా మెలగడంతో వివాదాస్పదమై ఫ్యాకల్టీ దృష్టికి వెళ్లింది. దీంతో ఫ్యాకల్టీ విద్యార్థిని క్రరతో చితకబాదారు. ఈ విషయం విద్యార్థి బంధువులు, స్నేహితులకు తెలిసి కళాశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో కళాశాల యాజమాన్యం గాయపడ్డ విద్యార్థిని, ఆందోళన చేస్తున్న వారిని సంస్థ కార్యాలయంలోకి పిలిపించి సర్ది చెప్పింది. ఇలాంటి పొరపాట్లు మళ్లీ జరగకుండా చూసుకుంటామని అతని బంధువులకు హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

మార్గశిర మాసోత్సవాలకు పక్కా ఏర్పాట్లు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 13 నుంచి జనవరి 11వరకు నిర్వహించనున్న మార్గశిర మాసోత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, ఉత్సవ సమన్వయ కమిటీ చైర్మన్ కె.ఎస్.విశ్వనాథన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, విద్యుత్ తదితర సదుపాయాలపై సంబంధిత శాఖాధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. దేవాలయం వద్ద అగ్నిమాపక శకటంతో పాటు సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖాధికారిని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వోని ఆదేశించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో మత్తు పానీయాల విక్రయాలు, వినియోగం లేకుండా సంచార బృందాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక నిఘా గస్తీ ఏర్పాటు చేయాలని అబ్కారి శాఖాధికారులను కోరారు. దేవాలయం పరిసరాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ముఖ్యమైన గురువారాల్లో అదనపు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. నెల రోజులు విశిష్ట, ప్రత్యేక, ఉచిత దర్శనాల కోసం తగిన ఏర్పాట్లతో పాటు షామియానాలు, విద్యుత్ అలంకరణ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా మార్గశిర మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఆలయ ఈవో శిరీష, ఆలయ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.నివాసరావు, పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ, దేవదాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'గంజాయి' నిందితుల అరెస్ట్



వివరాల వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాసరావు

అల్లిపురం: 214 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న కేసులో పలువురిని అరెస్ట్ చేసినట్లు నగర శాంతిభద్రల డీసీపీ-1 కె.శ్రీనివాసరావు తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అచ్చియ్యమ్మపేటలో గత నెల 29న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సిబ్బందితో కలసి గంజాయి అక్రమంగా నిల్వ ఉంచిన ఉమ్మిడి ధనలక్ష్మి ఇంట్లో సోదాలు చేశారు. ఆ రోజు 214 కిలోల గంజాయి, 101 ప్యాకెట్ల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమాని అందించిన సమాచారం మేరకు ఆ ఇంటికి అద్దెకు తీసుకున్న చెవ్వాకుల రాముని అరెస్ట్ చేసి మరో ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జె్రిపోతుల తాతాజీ, జె్రిపోతుల రమణ అల్లూరి జిల్లా మత్రిపాడుకు చెందిన కొర్ర చిరంజీవి, శ్రీనులు నుంచి గంజాయి సేకరిస్తున్నారు. ఆదిరాజు నాయుడు ఏర్పాటు చేసిన వాహనాల్లో అధికారి కూర్మారావు సాయంతో జాన దుర్గా ప్రసాద్, సంకిన శివకృష్ణ ఆ గంజాయిని నగరానికి చేరుస్తుండేవారు. ఆ గంజాయిని చెవ్వాకుల రాము ఎల్‌టీటీఈ, కోరమాండల్ రైళ్ల ద్వారా తమిళనాడు రాష్ట్రం తిరుచ్చికి చెందిన షేక్ మహమ్మద్ అబ్బాస్‌కు, అతని సహాయకుడు సిరాజుద్దీన్‌కు సరఫరా చేస్తుంటాడు. పోలీసులు వారిని విచారించగా షేక్ మహ్మద్ అబ్బాస్ ముంబయికి చెందిన ఆముద, కునాల్‌లకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు అంగీకరించాడు. వీరందరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. నిందితుల బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశామన్నారు.

అనుమానితులకు ఇళ్లు అద్దెకివ్వకండి

నగరంలో ఇళ్లు అద్దెకు ఇచ్చేవారు.. అద్దెకు దిగేవారి గురించి వివరాలు సేకరించాలని డీసీపీ కె.శ్రీనివాసరావు తెలిపారు. అద్దెకు దిగేవారి ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లు తీసుకోవాలని, అవసరమైతే పోలీస్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. అద్దెకు దిగిన వారు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా.. ఇంటి యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పద్మనాభం ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు



పద్మనాభం ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ గిరిబాబు

పద్మనాభం: స్థానిక ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్ పరిపాలనను గాడి తప్పించి.. వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని జెడ్పీ వైస్‌చైర్మన్ సుంకర గిరిబాబు ఆరోపించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఎ.మల్లికార్జునను కలిసి ఆయనపై ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టి.. తన సొంత నిర్ణయాలతో వ్యవస్థను గాడి తప్పిస్తున్నారని అందులో పేర్కొన్నారు. ఏదైనా పని నిమిత్తం నాయకులు ఎంపీడీవో వద్దకు వెళితే వారికి సరైన గౌరవం ఇవ్వడం లేదని, పైగా వారిని వేదనకు గురి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు పేమెంట్‌ల కోసం ఎం.బుక్‌లను ఎంపీడీవో వద్దకు తీసుకెళ్తే.. 10 శాతం కమిషన్ కోసం సంతకాలు పెట్టకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీడీవో కార్యాలయంలో తనకు అనుకూలంగా ఉన్న ఉద్యోగాలు పనిచేయకపోయినా ఏం అనడం లేదన్నారు. మిగిలిన ఉద్యోగాలను సస్పెండ్ చేస్తానని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. మండల సమావేశ మందిరంలో ఓ మహిళా కార్యదర్శి జన్మదిన వేడుకలు నిర్వహించి విందు కూడా ఇచ్చారన్నారు. ఎంపీడీవోపై విచారించి.. తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

యువతరంతోనే ఉత్తమ సమాజం



సమావేశంలో సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్

దొండపర్తి: విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా జ్ఞాన సముపార్జనపై దృష్టి పెట్టాలని, యువతరంతోనే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పేర్కొన్నారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో మహిళా పోలీసులు(వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి), విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి విద్యతో పాటు మంచి నడవడిక పట్ల యువతరంలో చైతన్యం తీసుకురావాలని, అందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. వార్డుల్లో గల సచివాలయాలు, పాఠశాలలు, కాలేజీల్లో పలు విషయాలపై అవగాహన కలిగిస్తూ వాల్ పోస్టర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. మహిళలకు సేఫ్టీపై అవగాహన కలిగించాలని, డీడీఎస్ హెల్ప్ లైన్ ఆవశ్యకతను పోస్టర్ల ద్వారా తెలియజేయాలన్నారు. మహిళా పోలీసులకు వార్డులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, మహిళలపై, పిల్లలపై ఎటువంటి దాడులు, మోసాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎల్లవేళలా సంబంధిత పోలీస్ వాట్సాప్ గ్రూప్‌లో యాక్టివ్‌గా ఉంటూ ముఖ్య సమాచారాలను పంచుకోవాలని, అవసరం మేరకు ఉన్నతాధికారులతో కూడా నేరుగా తమ సమస్యను పంచుకోవచ్చన్నారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినా డయల్ 100/112కు గానీ, వాట్సాప్ నెంబర్ 9493336633కు గాని లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో డీఈఓ ఎల్.చంద్ర కళ, దిశా ఏసీపీ వివేకానంద, విద్యా శాఖ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

- విశాఖ సర్కిల్‌కి రూ.1.46 కోట్ల నష్టం

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను సమయంలో ఈపీడీసీఎల్ సేవలు అద్భుతంగా ఉన్నాయని విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ అభినందించారు. సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడితో పాటు విద్యుత్ ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై చర్చించారు. తుపాను నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల పరిధిలోని 7 విద్యుత్ డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో విద్యుత్ అంతరాయాల నిరంతర పర్యవేక్షణ నిమిత్తం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు. తుపాను ప్రభావంతో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 21 నెం. 33/11కేవీ ఉప కేంద్రాలు మరమ్మతులకు గురవ్వగా త్వరితగతిన బాగు చేసి సరఫరా పునరుద్ధరించినట్లు సర్కిల్ ఎస్‌ఈ మహేంద్రనాథ్ వివరించారు. చెట్లు విరిగిపడి 11కేవీ స్తంభాలు 76, ఎల్‌టీ స్తంభాలు 203 విరిగిపోగా వాటిని 12 గంటల వ్యవధిలో మార్చామన్నారు. ఈ తుపాను వల్ల 16 మండలాల్లో 1,030 గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. మొత్తంగా మిచాంగ్ కారణంగా జిల్లాలో విద్యుత్ శాఖకు సుమారు రూ.1.46 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులకు ఎస్.మహేంద్రనాథ్ వివరించారు. 12 గంటల వ్యవధిలోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంపై సీఎండీ పృథ్వీతేజ్ అభినందించారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.70
బ్రాయిలర్ (లైవ్)	: రూ.90
స్కిన్	: రూ.150
స్కిన్‌లెస్	: రూ.160

18 ఎకరాల్లో ఆక్రమణలు గుర్తించాం



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్లు కృష్ణమూర్తి, అనూష

కొమ్మాది: రుషికొండ పరిధి ఒమ్మివానిపాలెంలో 18 ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని డిప్యూటీ కలెక్టర్లు కృష్ణమూర్తి, అనూష తెలిపారు. గురువారం అధికారులు ఆ ప్రాంతంలో పర్యటించి.. ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఒమ్మివానిపాలెంలో సర్వే నంబర్లు 18, 19, 20, 21, 28, 45, 48లోని ప్రభుత్వ స్థలాన్ని స్థానికులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఓ నాయకుడి ప్రోత్సాహంతో ఖాళీ స్థలంలో కొంతకాలంగా డెబ్రిస్‌తో నింపుతున్నారన్నారు. సమీపంలోని గెడ్డలో డెబ్రిస్ వేశారని, దీని వల్ల గెడ్డ మొత్తం పూడుకుపోయిందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారని, అయినా ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 18 ఎకరాల్లో ఆక్రమణలు గుర్తించామని, ఈ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి.. చుట్టూ ఫెన్సింగ్ వేస్తామన్నారు. అనంతరం పొక్లెయిన్‌తో డెబ్రిస్ తొలగించే పనులు ప్రారంభించగా.. అధికారులు, స్థానికుల మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. తహసీల్దార్ రమణయ్య, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఏసీపీ శాస్త్రి పాల్గొన్నారు.